రేషన్ బియ్యం పట్టివేత

మందమర్రి రూరల్, నవంబర్ 19: రామకృష్ణ పూర్(రవీంద్రఖని) నుంచి మహారాష్ట్ర వైపు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం సంచులను సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్టు తహసీల్దార్ సతీశ్ తెలిపారు. రెవెన్యూ అధికారులు మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు రవీంద్రఖని రైల్వే స్టేషన్ వద్ద తనిఖీ చేశారు. ఈ క్రమంలో రైల్వే ప్లాట్ ఫారంపై మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం సంచులను పట్టుకున్నారు. వీటిని ఎఫ్ఎస్ డీలర్ పాయింట్‌కు తరలించినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మందమర్రి రూరల్, నవంబర్19: మందమర్రి మండలంలోని శంకర్‌పల్లి గ్రామపంచాయతీ శివారులో అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న పాల వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గౌరీ శంకర్ మంగళవారం తెలిపారు. వీటిని పోలీస్ స్టేషన్ తరలించి మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఓ ట్రాక్టర్ యజమాని అవమానంతో అధికారులతో వాగ్వాదానికి ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిసింది.

సెలూన్ దగ్ధం

మంచిర్యాల అర్బన్, నవంబర్ 19: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద గల సెలూన్ మెన్స్ పార్లర్ మంగళవారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి షాపు నుంచి పొగలు వచ్చాయి. సమాచారం అందుకున్న అధికారులు ఫైర్ ఇంజిన్‌తో వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో షాపులోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని నిర్వాహకులు తెలిపారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

బెల్లంపల్లి, నవంబర్ 19 : రైలు కింద పడి మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ రావు తెలిపారు. మండలంలోని కన్నాల గ్రామపంచాయతీలోని లక్ష్మీపూర్‌కు చెందిన తిప్పరవేణి శ్రీను (48) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మతిస్థిమితం సరిగా లేక బాధపడుతున్నాడు. మూడు నెలల క్రితం ఎర్రగడ్డ దవాఖానలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. మంగళవారం ఇంట్లో నుంచి వెళ్లిన శ్రీను కన్నాల రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య రేణుక, కుమారుడు అఖిల్, కూతురు అక్షయ ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338964-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం

200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి

50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

బెల్లంపల్లి: 91827 77671, 91827 77677

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

మందమర్రి రూరల్, నవంబర్19: ఈ నెల 17న కాగజ్‌నగర్ పట్టణంలో పటేల్ గార్డెన్స్‌లో డ్రంకెన్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. మండలంలోని మోడల్ (ఆదర్శ్)స్కూల్ కు చెందిన జ్ఞానిక (6వ తరగతి)వెండి పతకం, శ్రేష్ట (9వ తరగతి) వెండి పతకం, కార్తికేయన్(9వ తరగతి)కాంస్య పతకం, మణిదీప్(9వ తరగతి) కాంస్య పతకం సాధించారు. వీరితో పాటు కరాటే మాస్టర్ రంగు శ్రీనివాస్‌ను మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీం, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

చెన్నూర్ రూరల్, నవంబర్ 19 : డిసెంబర్ నెల 10 నుంచి 15వ తేదీ వరకు వారణాసిలో జరగనున్న జాతీయ స్థాయి అండర్-14 ఇయర్స్ ఎస్ జీఎఫ్ పోటీలకు చెన్నూర్ మండలంలోని అస్నాద్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎం నక్షత్ర ఎంపికైనట్లు హెచ్ఎం అనురాధ, పీడీ సత్యనారాయణ తెలిపారు. నక్షత్రను డీఈవో యాదయ్య, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఫణిరాజా, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సిరంగి గోపాల్, గాజుల శ్రీనివాస్ అభినందించారు.

గురుకుల విద్యార్థులకు అభినందన

బెల్లంపల్లి, నవంబర్ 19 : కాసిపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు 10వ జోనల్ స్థాయి పోటీలలో 20కి పైగా పతకాలు, అండర్-14 లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించడం అభినందనీయమని ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రశంసించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఊట్ల సంతోష్‌కుమార్, పీడీ హరీశ్, పీఈటీ రాజేందర్ పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ

బెల్లంపల్లి, నవంబర్ 19 : తెలంగాణ సాంఘిక సంక్షేమ విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ములుగు జిల్లా జకారంలో నిర్వహించిన పదవ జోనల్ లెవల్ గేమ్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(సీఈవో) విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ దూట శ్రీధర్ తెలిపారు. అథ్లెటిక్స్‌లో సీహెచ్ అరవింద్, ఎం.హర్షిత్, కే.రాకేశ్, కే.బ్రిమ్రూవ్, అభినవ్, ఆర్.వివేకవర్ధన్, అండర్-14 చెస్ విభాగంలో డీ.రుతిక్ తేజ, అండర్ -19లో ఎం.వెంకటేశ్, క్యారమ్స్‌లో గిరిధర్ ప్రతిభ చూపి పతకాలు కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో అభినందన కార్యక్రమంలో పీఈటీలు అల్లూరి వామన్, ముచ్చకొండ రాజశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

మందమర్రి, నవంబర్19: మందమర్రి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పేరిట జరుగుతున్న రోడ్లు, డ్రైన్లు నిర్మాణాలలో నాణ్యతా లోపం కనిపిస్తుందని, నాణ్యతతో నిర్మాణాలు చేపట్టాలని జన సేన పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా నాయకులు మాయ రమేశ్ అన్నారు. పట్టణంలో రూ.78లక్షలతో జిల్లా పరిషత్ పాఠశాల ఒగ్రెగడ్డ నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి నాసిరకం ఇసుకను వాడుతున్నారని ఆరోపించారు. అనంతరం ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు, డీఈ సుమతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అసది సురేశ్, యాదగిరి ప్రసాద్, మహేందర్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

దండేపల్లి, నవంబర్19: దండేపల్లి మండలంలోని రెబ్బెన్‌పెల్లికి చెందిన కట్ట హన్మయ్య కుమారుడు సుధాకర్ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో మాజీ సర్పంచ్ కందుల కల్యాణి-అశోక్ ఆధ్వర్యంలో దాతల ద్వారా సేకరించిన రూ.44,716 వేల విరాళాన్ని అతనికి మంగళవారం ఇంటి వద్ద అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కందుల కల్యాణి, నాయకులు అశోక్, ఇండ్ల రవితేజ, కొట్టు మల్లేశ్ ఉన్నారు.

బాల్య మిత్రుడికి బాసటగా..

జన్నారం మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన సింగం వెంకటేశ్ తల్లి రాధ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. నిరుపేద కుటుంబం కావడంతో 2013-14 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన బాల్య మిత్రులు తమతోపాటు దండేపల్లి మండలం తాళ్లపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న వెంకటేశ్ కుటుంబానికి అండగా నిలిచారు. రూ.20వేల ఆర్థిక సహాయం అందించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలి

మందమర్రి రూరల్, నవంబర్19: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం క్యాతన్‌పల్లి రిటైర్డ్ ఎంప్లాయీస్ కాలనీ సమీపంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్లో లోకల్ కోర్ట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు విద్యుత్ డీఈఈ కైసర్, ఏడీఈ మోహన్ రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో మంచిర్యాల రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని నస్పూర్, మందమర్రి, క్యాతనపల్లి, హాజీపూర్ మండలంలోని విద్యుత్ వినియోగదారులు అర్జీలు ఇవ్వాలని సూచించారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

శివిని ఆమని (ఫైల్)

మంచిర్యాల అర్బన్, నవంబర్ 19: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో నెల రోజుల్లో మూడు ఆపరేషన్లు అయిన బెల్లంపల్లి పట్టణానికి చెందిన శివిని ఆమని (42) మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంచిర్యాలలో నెల రోజుల పాటు ప్రైవేట్ దవాఖాన చికిత్స పొందింది. మెరుగైన వైద్యం కోసం వారం క్రితం హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తరలించారు. మంగళవారం ఉదయం కార్డియా అరెస్ట్ కావడంతో అక్కడి వైద్యులు సీపీఆర్ చేసినప్పటికీ కొద్దినిమిషాల్లో మరోసారి గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు.

చేసిన పనులకు బిల్లులు రావడం లేదు

నెన్నెల, నవంబర్ 19 : గ్రామ పంచాయతీల్లో కొన్ని నెలల కిందట చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు రావడం లేదని మండల మాజీ సర్పంచులు మంగళ వారం సాయంత్రం ఎమ్మెల్సీ కోదండ రాంకు వినతి పత్రం అందజేసి తమ గోడును వెల్లబోసుకున్నారు. ప్రభుత్వంతో మాట్లాడి తమ బిల్లులను సకాలంలో చెల్లించేలా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వంతో మాట్లాడి బిల్లులు వచ్చేలా చూస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. అనంతరం మ్మెల్సీని సన్మానించారు. అంతకుముందు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో పాటు ఎమ్మెల్సీ కోదండరాం మండలంలోని జోగాపూర్, గొల్లపల్లి, మైలారం గ్రామాల్లో పర్యటించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

జైపూర్, నవంబర్ 19: ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ కోదండరాంరెడ్డి పేర్కొన్నారు. ఎమెల్సీగా ఎన్నికై మొదటిసారిగా మంగళవారం జిల్లాకు వచ్చిన సందర్భంగా ఇందారం వద్ద కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం జైపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఆయనను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పేరారెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు.

ఘనంగా అంగారక సంకష్టహర చతుర్థి

మంచిర్యాల అర్బన్, నవంబర్ 19: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని విశ్వనాథ స్వామి ఆలయంలో మంగళవారం అంగారక సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని అభిషేకాలు, హోమం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు సంగనభట్ల నరహరి శర్మ, వామనభట్ల శ్రీకేశ్ శర్మ తీర్థప్రసాదాలను అందజేశారు.
తాండూర్, నవంబర్ 19 : తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లోని స్వయంభూ వృక్ష వరసిద్ధి వినాయకుడి ఆలయంలో సంకష్టహర (అంగారకి) చతుర్థి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

• పోలీస్ బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు • జిల్లా స్థాయి అండర్ -17, 14 బాక్సింగ్ పోటీలు ప్రారంభం

బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కమాండెంట్ వెంకట్రాములు

హాజీపూర్, నవంబర్ 19 : విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ పీ వెంకట్రాములు అన్నారు. మంగళవారం మండలంలోని గుడిపేటలో మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్వంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి అండర్ -17, 14 విభాగాల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రీడా పోటీల్లో పతకాలు సాధిస్తే ఉద్యోగ సాధన సులువు అవుతుందన్నారు. తాను కూడా స్పోర్ట్స్ కోటాలోనే పోలీస్ ఉద్యోగం సాధించానని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి ఒలింపిక్స్ వరకు వెళ్లాలని సూచించారు. ఫిట్‌నెస్ కోసం రోజుకు కనీసం గంట కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ ప్రిన్సిపాల్ శేరు శ్రీధర్, ఆర్ ఐ శ్రీనివాస్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ ఫణిరాజా, బాక్సింగ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సెక్రటరీ శేఖర్, జాయింట్ సెక్రెటరీ దేవేందర్, పీడీ సురేశ్, పీఈటీ నగేశ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

• అదనపు కలెక్టర్ మోతీలాల్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

దండేపల్లి, నవంబర్19: కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని రైతులకు మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ సూచించారు. దండేపల్లి మండలంలోని ద్వారక రైతువేదికలో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. వరి పంట పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతనే కోయాలన్నారు. హార్వెస్టర్ స్పీడ్ 18 నుంచి 20 ఆర్‌పీఎం మెయింటెన్ చేయాలన్నారు. పొలం వద్దనే ధాన్యాన్ని ఆరబెట్టుకొని తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కల్పన, డీఎస్‌డీవో సురేఖ, తహసీల్దార్ సంధ్యారాణి, ఏవో అంజిత్‌కుమార్, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

వేమనపల్లి, నవంబర్ 19: మండల శివారులోని మంగళవారం వ్యవసాయాధికారి రమ రైతులకు కోత సమయంలో కలిగే జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు వరికోసే ప్రయత్నంలో 18 ఆర్పీఎం పెట్టి లోయర్ ను ఆన్‌లో పెట్టి హార్వెస్టర్ చేయాలన్నారు. హార్వెస్టర్ డ్రైవర్ల రైతులు వరి కొయ్యకాలను కాలబెట్టడం ద్వారా వాతావరణ కాలుష్యం జరుగుతుందని తెలిపారు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జన్నారం, నవంబర్ 19 :మండలంలోని ఇందన్‌పెల్లి, పొనకల్, రాంపూర్, తిమ్మాపూర్, తపాలాపూర్ గ్రామాల్లో మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ వరిదాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముజఫర్ అలీఖాన్, మేకల మాణిక్యం, ఎం రాజశేఖర్, సయ్యద్ ఇసాక్, లక్ష్మీనారాయణ, ఐకేపీ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

లగచర్లలో గిరిజనులపై కేసులు ఎత్తివేయాలి

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న లంబాడీ హక్కుల జాగృతి సమితి నాయకులు

జన్నారం, నవంబర్ 19 : వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గ్రామ గిరిజనులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ మండల లంబాడీ హక్కుల జాగృతి సమితి అధ్యక్షుడు బానావత్ సంతోష్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి మాట్లాడారు. తరతరాలుగా సాగు చేసుకొని బతుకుతున్న లంబాడీ గిరిజనుల భూములను లాక్కొని ఫార్మా కంపెనీకి కట్టబెట్టేందుకు రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేసి గిరిజనుల వేధించి అన్యాయంగా అరెస్టు చేసి కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల జాగృతి సమితి నాయకులు దినేశ్ నాయక్, భూక్యా సంతోష్, బీ రాజు, భరత్‌నాయక్, బీవీఎస్ కైలాస్ పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్, నవంబర్ 19: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ మంగళవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కోరారు. హైదరాబాద్‌లోని గాంధీ భవనంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఇందిరాగాంధీ జయంతి

నమస్తే నెట్‌వర్క్, నవంబర్ 19 : దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని అన్ని మండలాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా నాయకులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు

మీ-సేవ కేంద్రం అనుమతి రద్దు

జైనూర్, నవంబర్ 19 :జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలో సయ్యద్ ముబారక్ కు చెందిన మీ-సేవ కేంద్రం, ఆధార్ పీఈసీ కేంద్రం అనుమతులు రద్దు చేశామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తెలిపారు. కేంద్రంలో దరఖాస్తుదారులకు రసీదు ఇవ్వకపోవడం, సేవలు నిర్ణీత ధరలకు అదనంగా వసూలు చేయడం, ధరల పట్టికను ప్రదర్శనలో ఉంచకపోవడం, ఇతర నిబంధనలు ఉల్లంఘించడంతో సమగ్ర విచారణ జరిపి మీ -సేవా కేంద్రం, ఆధార్ పీఈసీ అనుమతులు రద్దు చేసినట్లు తెలిపారు.

రైతు నేస్తం పై వీడియో కాన్ఫరెన్స్

రెబ్బెన, నవంబర్ 19: రెబ్బెనలోని రైతు వేదికలో రైతు నేస్తంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నట్లు రెబ్బెన వ్యవసాయశాఖ అధికారి దిలీప్‌కుమార్ తెలిపారు. అనంతరం మండలంలోని డీలర్లతో సమావేశం నిర్వహించిన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రాకేశ్, సుకన్య, సంజీవ్, కృపామణి, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

బెల్లంపల్లి, నవంబర్ 19 : పట్టణంలోని రైల్వే స్టేషన్ ముందు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు రైల్వేస్టేషన్ సమీపంలో పోలీసులు మాటు వేసి కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన ఎండీ.జీషాన్, కాసిపేట మండలం ముత్యంపల్లికి చెందిన బాకీ గౌతమ్ గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని పేర్కొన్నారు. వారి వద్ద 28 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

మంచి ఆహార అలవాట్లతోనే ఆరోగ్యకరమైన జీవనం

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరిశ్‌రాజ్

మంచిర్యాల అర్బన్, నవంబర్ 19: మంచి ఆహార అలవాట్లు, శుభ్రత పాటించడం ద్వారా జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పులు సాధించవచ్చని డీఎంహెచ్‌వో హరిశ్ రాజ్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కలెక్టరేట్‌లో మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు, మండలి వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, అర్‌బీఎస్‌కే వైద్యులు, ఫార్మసిస్టులకు ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా నిర్వహించిన పాఠశాల ఆరోగ్య శిక్షణ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి యాదయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో అనితతో కలిసి మాట్లాడారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, వైద్యులు, సిబ్బంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కాగజ్‌నగర్, నవంబర్ 19: ఆటో డ్రైవర్లు, ఆటో ఓనర్స్ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో పోలీసులు మీకోసంలో భాగంగా ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. వాహన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ నియమాలు, రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా ఉన్న ముగ్గురు డ్రైవర్లను సన్మానించారు. బస్టాండ్ ఎదురుగా పండ్ల దుకాణాలను తొలగించాలని కోరుతూ పట్టణ సీఐకు ఆటో యూనియన్ సభ్యులు మెమోరాండం అందజేశారు. తొలగిస్తామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దీకొండ రమేశ్ , ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యాపారాలు చేయొద్దు

• సీఐ వేణుచందర్

జైపూర్, నవంబర్ 19: రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ హెచ్చరించారు మంగళవారం రాత్రి ఇందారం బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని పలువురు వాహనదారులకు జరిమానా విధించారు. ఇందారం బస్టాండ్ వద్ద రోడ్డుపై గప్ చుప్‌ల బండి, బజ్జీల బండి నిర్వహణతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ ఖండ పథ సంచలన్

చెన్నూర్ టౌన్, నవంబర్ 19 : చెన్నూర్ పట్టణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చెన్నూర్ ఖండ పథ సంచలన్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శిశుమందిర్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహవాది సుభాష్ హాజరయ్యారు. సంచలన్‌ను పురస్కరించుకొని స్వయం సేవకులు పూర్తి గణవేశలో పట్టణంలో ర్యాలీ తీశారు. పెద్ద సంఖ్యలో పట్టణ, ఇతర ప్రాంతాల ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సెమినార్

కాగజ్‌నగర్, నవంబర్ 19: కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు కంపెనీ సెక్రటరీ కోర్సుపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ అధికారి వీ శ్రీనివాస్, ఎం.ప్రవీణ్ కుమార్ హాజరై విద్యార్థులకు కంపెనీ సెక్రటరీ కోర్సు పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డి జనార్దన్, అధ్యాపకులు ఎం రాజేశ్వర్, డాక్టర్ దేవేందర్ ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

• జిల్లా బాలల సంరక్షణ అధికారి బుర్ర మహేశ్



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి

వాంకిడి, నవంబర్ 19: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి బుర్ర మహేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య వివరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే 1098 చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. భోజనం, తాగునీరు అందించే విషయంలో శుభ్రత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ డోంగ్రే ప్రవీణ్ కుమార్, సూపర్‌వైజర్ పితంబర్ చైల్డ్ లైన్ బాలసదనం తదితరులున్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

కౌటాల, నవంబర్ 19 : ఈ నెల 17న కాగజ్‌నగర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పో